సాక్షి వనపర్తి

సోమవారం : 27 : మే : 2024



క్రీడాకారుల్లో జోష్

హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లు క్రీడాకారుల్లో జోష్ నింపుతున్నాయి.

వివరాలు 8లో ▸



రూ.1.05 కోట్ల ప్రతిపాదనలు

అలంపూర్‌లోని పురాతన ఆలయాల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం 40.0 /25.6

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జోగుళాంబ సన్నిధిలో వనపర్తి కలెక్టర్



అలంపూర్ రూరల్: శక్తిపీఠమైన జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను ఆదివారం వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఈఓ పురేందర్‌కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బాలబ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబదేవి ఆలయాల్లో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేయడంతోపాటు శేషవస్త్రాలతో సత్కరించారు. అదేవిధంగా, టీవీ యాక్టర్, కమెడియన్ ఫణి సైతం ఆలయాన్ని దర్శించుకున్నారు.

రామన్‌పాడులో 1,012 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో ఆదివారం 1,012 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా నీటి సరఫరా లేదని.. సమాంతర కాల్వ ద్వారా 27 క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరుతుందని వివరించారు. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు రోజు వినియోగిస్తున్నామని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

కల్వకుర్తి టౌన్: నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లోని ఎస్సీ గురుకులాల ఈస్ట్ రీజియన్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా ఆర్‌సీఓ వనజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఎల్‌టీ, సీజీటీ కోర్సులలో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు www.tswreis.ac.in వెబ్‌సైట్ ద్వారా రూ. 100 ఫీజు చెల్లించి, ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సమీపంలోని ఎస్సీ గురుకుల కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

గతుకుల రోడ్లే దిక్కు

- పూర్తిగా ధ్వంసమైన మూలమళ్ల రహదారి
- నిత్యం ప్రయాణికుల పాట్లు
- నిధులు మంజూరైనా సాగని పనులు



వివరాలు 9లో ▸

భూసార పరీక్షలేవి..?

జిల్లాకేంద్రంలో మూతబడిన కేంద్రాలు



ప్రారంభోత్సవానికే పరిమితమైన భూసార పరీక్ష కేంద్రం

- నిధుల విడుదలపై నిర్లక్ష్యం?
- డిప్యూటేషన్‌పై సిబ్బంది విధులు
- మూస పద్ధతిలోనే ఎరువుల వినియోగం
- నేటి నుంచి గ్రామాల్లో రైతు సదస్సులు

వనపర్తి: భూసార పరిరక్షణపై నిర్లక్ష్యం ఆవహించింది. మూడేళ్లుగా వ్యవసాయశాఖ అధికారులు అన్నదాతలకు భూమిలో లోపించిన సూక్ష్మధాతువులపై అవగాహన కల్పించడం లేదు. శాస్త్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామంటూనే. .రైతులను మూస ధోరణిలోకి నెట్టేశారనేందుకు మూడేళ్లుగా నిర్వహించని భూసార పరీక్షలే నిదర్శనంగా చెప్పవచ్చు. గతంలో ఏటా వానాకాలం సీజన్‌కు ముందు గ్రామాల్లో రైతు చైతన్య యాత్రల పేరుతో భూసార పరీక్షలు, విత్తనాలు, ఎరువుల ఎంపిక, వినియోగంపై వ్యవసాయశాఖ అధికారులు రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించేవారు. కొంతకాలంగా సాగునీటి లభ్యత పెంచామంటూ.. భూమిలో లోపించే పోషకాలు, ఎరువుల రూపంలో అందించాల్సిన ఆర్గానిక్ కార్బన్, లవణాలు, నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి వాటిపై దృష్టి సారించకపోవటం గమనార్హం.

జిల్లాలో 2.63 లక్షల ఎకరాలు..

జిల్లాలో మొత్తం 2.63 లక్షల ఎకరాల సాగుభూమి ఉండగా.. సగానికిపైగా వరి సాగవుతోంది. పంటల మార్పిడి లేకపోవడంతో రోజురోజుకు భూమిలో సారం తగ్గుతోంది. భూమి ఆరోగ్యంపై రైతులకు సరైన అవగాహన కల్పించకపోవడంతో రసాయన ఎరువులతో దిగుబడి పెంచుకోవడంపై దృష్టి సారిస్తున్నారే తప్పా.. భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందించలేకపోతున్నామన్న విషయాన్ని అన్నదాతలు గుర్తించలేకపోతున్నట్లు వ్యవసాయశాఖ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి నివేదించాల్సిన వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు నిర్లక్ష ధోరణి ప్రదర్శించడంతో అత్యంత ముఖ్యమైన భూసార పరీక్షలు అటకెక్కాయి.



మూడేళ్లుగా తెరుచుకోని భూసార పరీక్ష కేంద్రం

ప్రారంభానికే పరిమితం..

జిల్లాకేంద్రంలోని నాగవరం శివారులో ఉన్న వ్యవసాయ ఏడీఏ కార్యాలయం సమీపంలో భూసార పరీక్ష కేంద్రాన్ని గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరీక్షలు నిర్వహించేందుకు కావాల్సిన పరికరాలు, సామగ్రిని సమకూర్చలేదు. దీంతో ఈ కేంద్రం ప్రారంభోత్సవానికే పరిమితమైంది. 30 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన భూసార పరీక్ష కేంద్రానికి మూడేళ్లుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మూతబడింది. ఈ కేంద్రంలో విధులు నిర్వహించాల్సిన టెక్నికల్ ఏఓను భూత్పూర్ మండలానికి డిప్యూటేషన్‌పై పంపించగా.. ఏఈఓ, ఇతర సిబ్బందిని స్థానికంగా ఇతర కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. మూడేళ్లుగా జిల్లాకేంద్రంలోని కేంద్రం తాళం వేసి దర్శనమిస్తోంది.

బడ్జెట్ లేకనే మూతబడ్డాయి..

ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మూడేళ్లుగా జిల్లాలో భూసార పరీక్షలు నిర్వహించడం లేదు. నిజానికి వ్యవసాయంలో భూమి ఆరోగ్యం సంరక్షించుకవడం చాలా ముఖ్యం. ఏటా వానాకాలానికి ముందు భూమిలో సారం ఎంతమేర ఉందనే విషయాన్ని పరీక్షల ద్వారా తెలుసుకోవాలి. అందుకు అనుగుణంగా పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు పొలంలో వేసుకోవాల్సి ఉంటుంది. కానీ కొంతకాలంగా భూమిలో లోపించిన పోషకాలను తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహించడం లేదు. భూమి ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే.. నేలలు చవుడుగా మారి దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది.

– డి.చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ డీఏఓ, వనపర్తి

నేటి నుంచి అవగాహన కార్యక్రమాలు..

మునుపటిలా వ్యవసాయశాఖ అధికారులు సోమవారం నుంచి జిల్లావ్యాప్తంగా ఎరువులు, విత్తనాల ఎంపిక, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలోని 14 మండలాల్లో ఆయా మండల వ్యవసాయశాఖ అధికారులు ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కొత్త చట్టాలపై అవగాహన తప్పనిసరి

- ఎస్పీ రక్షిత కె.మూర్తి

వనపర్తి: వచ్చే నెల నుంచి అమలులోకి రానున్న కొత్త క్రిమినల్ చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ రక్షిత కె.మూర్తి అన్నారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖ జారీచేసిన ప్రకటన ప్రకారం.. భారత శిక్షాస్మృతి (ఐపీసీ) 1860, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ)1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 172 చట్టాల స్థానంలో కొత్త చట్టాలను రూపొందించి అమలులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. సత్వర న్యాయం, న్యాయవ్యవస్థ బలోపేతానికి మూడు చట్టాల స్థానంలో కొత్తవి అమలులోకి తీసుకొచ్చేందుకు 2023, డిసెంబర్ 21న పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం తీర్మానం చేసిందని, 2023, డిసెంబర్ 25న కొత్త చట్టాల అమలుకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆమోదముద్ర వేసినట్లు గుర్తుచేశారు. మారిన కాలానుగుణంగా చట్టాలను అప్‌డేట్ చేయటమే ముఖ్య ఉద్దేశని తెలిపారు. కొత్త చట్టాలపై డీఎస్పీ స్థాయి అధికారి నుంచి కానిస్టేబుల్ వరకు అందరికి శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. నూతన చట్టాలపై హైదరాబాద్‌లో శిక్షణ పొందిన ఎస్‌ఐ వెంకటస్వామి, ఏఎస్‌ఐ బాషా విడతల వారీగా పోలీస్‌శాఖలోని ప్రతి ఒక్కరికి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఎస్పీ రక్షిత కె.మూర్తి

స్పోర్ట్స్ స్కూల్‌కు వేళాయె



మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియంలో సాధన చేస్తున్న చిన్నారులు

- హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో క్రీడా పాఠశాలలు
- ప్రతి పాఠశాలలో 40 మంది చొప్పున చేరిక
- 4వ తరగతిలో మాత్రమే ప్రవేశానికి అవకాశం
- జూన్ నుంచి ఆగస్టు వరకు జిల్లా, రాష్ట్రస్థాయి ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో ప్రస్తుత 2024–25 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాలకు త్వరలో జిల్లా, రాష్ట్రస్థాయి సెలక్షన్స్ జరగనున్నాయి. మేడ్చల్ జిల్లాలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో స్పోర్ట్స్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో 4వ తరగతికి మాత్రమే ప్రవేశం ఉంటుంది. ఈ ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులకు కొన్ని శారీరక, సామర్థ్యానికి సంబంధించిన వాటితోపాటు పలు వాటిలో టెస్టులు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఎవరైతే ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎక్కువ స్కోర్ సాధిస్తారో వారికి 4వ తరగతిలో ప్రవేశం లభిస్తుంది. రాష్ట్రంలో మూడు స్పోర్ట్స్ స్కూళ్లు ఉండగా ప్రతి స్కూల్‌లో 4వ తరగతిలో 20 మంది బాలురు, 20 మంది బాలికలను ఎంపిక చేస్తారు.

జిల్లాస్థాయి పోటీలకు ఇలా..

జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు తమ వయస్సు ధ్రువీకరణ పత్రాలు పాఠశాల ప్రధానోపాధ్యాయునితోపాటు మున్సిపాలిటీ, పంచాయతీకి సంబంధించిన వయస్సు ధ్రువీకరణ పత్రాలతో రావాలి. అలాగే రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, 3వ తరగతి పాస్ సర్టిఫికెట్‌తో జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు హాజరుకావాలి.

10 పాయింట్లు స్కోర్ సాధిస్తే..

జిల్లా, రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ జూన్ నుంచి ఆగస్టు వరకు నిర్వహించనున్నారు. శారీరక సామర్థ్య పరీక్షల్లో కనీసం 10 పాయింట్లు స్కోర్ సాధిస్తే రాష్ట్రస్థాయికి పంపిస్తారు. రాష్ట్రస్థాయిలో ఎవరైతే ఎంపికైతే స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పిస్తారు.

శారీరక సామర్థ్య పరీక్షలు..

- ఎత్తు
- బరువు
- 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్
- స్టాండింగ్ బ్రాడ్‌జంప్
- 800 మీటర్ల రన్నింగ్
- 6 X 10 మీటర్ల షటిల్ రన్
- మెడిసన్ బాల్ త్రో
- వర్టికల్ జంప్
- ఫ్లెక్సిబిలిటీ టెస్ట్
- మెడికల్ టెస్ట్

చిన్నారులకు ప్రత్యేక శిక్షణ

జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం కొంతమంది చిన్నారులు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. స్పోర్ట్స్ స్కూళ్లలో నిర్వహించే ఫిట్‌నెస్ అంశాలపై ఉదయం, సాయంత్రం వేళల్లో అథ్లెటిక్స్ కోచ్ సునీల్‌కుమార్ శిక్షణ ఇస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువ మంది స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు పొందుతున్నారు. స్పోర్ట్స్ స్కూళ్లకు విద్యార్థులను పంపించాలనే ఆసక్తి తల్లిదండ్రుల్లో కూడా వస్తోంది.



శిక్షణ తీసుకుంటున్న ఓ చిన్నారి

శిక్షణ బాగుంది..



ఈ ఏడాది స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక వుతానన్న నమ్మకం ఉంది. జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్‌లో పాల్గొనాలని ప్రతిరోజు స్టేడియంలో ప్రాక్టిస్ చేస్తున్నా. సునీల్ సార్ చాలా మంచిగా శిక్షణ ఇస్తున్నారు.

– సాయి ఆరాధ్య, మహబూబ్‌నగర్

క్రీడాకారుడిని అవుతా



స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికై పెద్దయ్యాక క్రీడాకారుడిని అవుతాను. ఇదే లక్ష్యంగా రెండు నెలల నుంచి స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న. మా నాన్న వెంట ప్రతి రోజు స్టేడియానికి వస్తున్నా. ఎలాగైనా ఈసారి స్పోర్ట్స్ స్కూల్‌లో సీటు సాధిస్తాను.

– ఎల్విస్ స్టీఫెన్, మహబూబ్‌నగర్

సద్వినియోగం చేసుకోవాలి..



ఈ ఏడాది స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాల కోసం మెయిన్ స్టేడియంలో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. చిన్నారులకు జిల్లా, రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో నిర్వహించే శారీరక దేహదారుఢ్య అంశాలపై ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నారు. చిన్నారులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

– సునీల్‌కుమార్, అథ్లెటిక్స్ కోచ్, మహబూబ్‌నగర్

వేర్వేరు చోట్ల ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం

- రేకుల షెడ్డు కూలి నలుగురు, పిడుగు పడి ఇద్దరు, రాయి తగిలి మరొకరు..
- తండ్రులకు సహాయంగా వెళ్లి.. అసువులుబాసిన ఓ బాలిక, బాలుడు
- మరో నలుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- నాగర్‌కర్నూల్ జిల్లాలో పెనువిషాదం నింపిన గాలివాన బీభత్సం

అకాల మృత్యువు



తాడూరులో ఈదురుగాలుల ధాటికి కూలిన రేకుల షెడ్ వద్ద గుమిగూడిన జనం

వారంతా బడుగు జీవులు.. నిత్యం రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితులు.. ఉన్నంతలో తమ పనులు చేసుకుంటూ కుటుంబాలతో కలిసి జీవితాలను నెట్టుకొస్తున్నారు. ఈ క్రమంలోనే రోజు మాదిరిగానే ఆదివారం సైతం వారి వారి పనుల్లో నిమగ్నమయ్యారు. కానీ, వీరిని విధి చిన్నచూపు చూసింది.. ఈదురుగాలులు, అకాల వర్షం రూపంలో మృత్యువు కబళించింది. రేకుల షెడ్డు కూలిపడి కూలీ పనులకు వచ్చిన తండ్రీ కూతురుతోపాటు మరో ఇద్దరు, పిడుగు పడి తండ్రితో కలిసి మేకలను మేపడానికి వెళ్లిన ఓ బాలుడు, పొలంలో పనులు చేసుకుంటున్న రైతు, ఈదురుగాలులకు రాయి తగిలి వాహనం నడుపుతున్న ఓ డ్రైవర్.. ఇలా వేర్వేరు ఘటనల్లో ఏడుగురు దుర్మరణం పాలైన విషాదకర సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో తీవ్ర విషాదం నింపింది.

– తాడూరు/ నాగర్‌కర్నూల్ క్రైం/ బిజినేపల్లి/ తెలకపల్లి/ పెద్దకొత్తపల్లి

రేకుల షెడ్డు కూలిపడి..

ఈదురుగాలులకు రేకుల షెడ్డు కూలిపడి నలుగురు దుర్మరణం చెందిన సంఘటన తాడూరు, ముష్టిపల్లి గ్రామాల్లో తీవ్ర విషాదం నింపింది. ఈ ప్రమాదంలో తాడూరుకు చెందిన మల్లేష్ రేకుల షెడ్డు నిర్మాణ పనుల కోసం వచ్చాడు. అతని వెంట కూతురు అనూష సైతం రాగా రేకుల షెడ్డు మీదపడటంతో ఇద్దరూ దుర్మరణం పాలయ్యారు. మల్లేష్‌కు భార్య పార్వతమ్మ, మరో కూతురు ఉన్నారు. అలాగే అడ్డా మీది కూలీలుగా వచ్చిన ముష్టిపల్లి రాములు, చెన్నమ్మలు కూడా ఈ ప్రమాదంలో మృత్యువాతపడ్డారు. వీరు ముష్టిపల్లిలో ఉపాధి లేక పదేళ్ల క్రితం నాగర్‌కర్నూల్‌కు వచ్చి అడ్డా కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. చెన్నమ్మకు భర్త రాముడు, నలుగురు పిల్లలు ఉన్నారు. వీరిలో ముగ్గురు ఆడపిల్లలు కాగా.. ఒక కుమారుడు. చెన్నమ్మ మృతితో వీరంతా రోడ్డునపడ్డారు. అలాగే రాముడుకు భార్య జ్యోతితోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరి కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ నాగమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రాజా కోరారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కనకయ్య తెలిపారు. ఘటనా స్థలం నుంచి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించామని చెప్పారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ కనకయ్య

పిడుగుపాటుతో మరో ఇద్దరు..

పిడుగుపాటుతో రైతుతోపాటు ఓ బాలుడు మృతిచెందాడు. తిమ్మాజిపేట మండలం మారేపల్లికి చెందిన రైతు వెంకటయ్య(52) తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా.. పిడుగుపాటుకు గురయ్యాడు. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే మృతిచెందాడు. అతడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తండ్రికి సహాయంగా వచ్చి..

తెలకపల్లి మండల కేంద్రానికి చెందిన దండు లక్ష్మణ్ (12) తన తండ్రి వెంకటయ్యతో పాటు మేకలను మేపడానికి వ్యవసాయ పొలానికి వెళ్లాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో సమీపంలో ఉన్న చెట్టు కిందకు వెళ్లాలని తండ్రి సూచించాడు. లక్ష్మణ్ చెట్టు కిందకు వెళ్లిన కొద్దిసేపటికే పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. తన కళ్లెదుటే కొడుకు చనిపోవడంతో తండ్రితో పాటు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. మృతుడు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్నాడు.

దైవదర్శనం చేసుకొని వస్తుండగా..

వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నీలపల్లికి చెందిన వేణుగోపాల్(38) శనివారం తన క్రూయిజర్ వాహనంలో 12 మంది ప్రయాణికులతో శ్రీశైలం వెళ్లి.. దైవదర్శనం అనంతరం స్వగ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యంలోని మంతటి స్టేజీ వద్ద ఈదురుగాలుల ధాటికి ఓ షెడ్ రేకులు రాయితో సహా వాహనంపై పడటంతో డ్రైవర్ వేణుగోపాల్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వాహనంలో ఉన్న మిగతా ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



ప్రమాదానికి కారణమైన రాయి



ట్రాక్టర్‌పై మృతదేహాలను నాగర్‌కర్నూల్ తరలిస్తున్న పోలీసులు

బీజేపీపై తిరుగుబాటు తప్పదు : సీపీఐ (ఎంఎల్)



సమావేశంలో మాట్లాడుతున్న హన్మేష్

అమరచింత: ఐకమత్యంతో ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజల మధ్య మత ఘర్షణలు సృష్టిస్తూ బీజేపీ రాజకీయం చేస్తోందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు హన్మేష్ ఆరోపించారు. మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సమావేశం ఆదివారం జరగగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 200 ఏళ్లు పాలించిన బ్రిటిష్ ప్రభుత్వం, మొఘలాయిలు, తురుష్కులు, నవాబుల కన్నా పదేళ్ల బీజేపీ పాలన మరింత దారుణంగా ఉందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని నరేంద్ర మోదీ కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్రజా ప్రయోజనాలే ముఖ్యమంటూనే పేదలకు సంక్షేమ ఫలాలను దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆరాచకాలు ఎక్కువయ్యాయని.. వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మాస్‌లైన్ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాంచందర్, ఇఫ్టూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సూర్యం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, హన్మంతు, సాంబశివుడు, ప్రసాద్, ఆర్ఆర్ మన్యం, సత్యం, గౌస్, వెంకటేష్, గణేష్, దేవదానం, కొండారెడ్డి, శివారెడ్డి, చంద్రన్న, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

టీ-20 టోర్నీలో జిల్లా జట్టుకు రెండో విజయం

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ టీ-20 టోర్నమెంట్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తన రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. ఆదివారం జింఖానా గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో జిల్లా జట్టు 41 పరుగుల తేడాతో నిజామాబాద్ జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో అబ్దుల్ రాఫే అర్ధ సెంచరీతో రాణించాడు. 44 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్స్‌తో 56 పరుగులు చేశాడు. ఇతర క్రీడాకారులు డేవిడ్ క్రిపాల్ 46, జయసింహ 21 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు 16.2 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్లు అరుణ్‌కుమార్ 3, శ్రీకాంత్‌యాదవ్ 2, జయసింహ 2 వికెట్లు తీశారు. టోర్నీలో వరుసగా రెండు విజయాలతో జిల్లా జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది. ఈనెల 28న కరీంనగర్ జట్టుతో జిల్లా జట్టు సెమీఫైనల్‌లో తలపడనుంది. జిల్లా జట్టు విజయంపై ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా హర్షం వ్యక్తం చేశారు.



జిల్లా జట్టుతో రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా

క్లుప్తంగా

ప్రమాదంలో గాయపడ్డ యువకుడు మృతి


ఎల్లప్ప (ఫైల్)

అమరచింత: కొత్తకోట హైవేపై జరిగిన బైక్ ప్రమాదంలో శనివారం గాయపడిన ఎల్లప్ప(29) వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మండలంలోని సింగంపేటకు చెందిన ఎల్లప్ప నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌లోని కిరాణం పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. మూడు రోజుల కిందట స్వగ్రామమైన సింగంపేటకు వచ్చి శనివారం బైక్‌పై హైదరాబాద్‌కు బయలు దేరాడు. కొత్తకోట పాలెం మధ్యలో ఓ ప్రైవేట్ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రక్తపు మడుగులో ఉన్న ఎల్లప్పను జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య గతేడాది మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి దుర్మరణం

- యజమాని ఇంటి ఎదుట ఆందోళన చేపట్టిన బాధిత కుటుంబసభ్యులు



రాజోళి: మట్టి తరలింపు ట్రాక్టర్ ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కర్నూలు జిల్లా కొంతలపాడుకు చెందిన గొల్ల చంద్రశేఖర్ (19) మండల కేంద్రం నుంచి తూర్పుగార్లపాడు వైపు వెళ్తున్నాడు. తూర్పుగార్లపాడుకు చెందిన ట్రాక్టర్ మట్టి లోడ్‌తో వస్తూ వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న చంద్రశేఖర్ కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహంతో ట్రాక్టర్ యజమాని ఇంటి ఎదుట ఆందోళన చేపట్టి అక్కడే అంత్యక్రియలు చేస్తామని బైఠాయించారు. విషయం తెలుసుకున్న సీఐ రత్నం, ఎస్ఐ సంతోష్ అక్కడకు చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య


శశాంక్‌రెడ్డి(ఫైల్)

లింగాల: అప్పులు తీర్చలేక కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక మండల కేంద్రానికి చెందిన శశాంక్‌రెడ్డి(32) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేస్తున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నంపల్లి మాజీ మాజీ సర్పంచ్ వనజ, విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులకు శశాంక్‌రెడ్డి ఏకైక కుమారుడు. సీఏ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం దేవరకొండ సమీపంలోని చెరుకుపల్లికి చెందిన ప్రణీతతో వివాహమైంది. ప్రస్తుతం హైదరాబద్‌లో నివాసం ఉంటున్నారు. ఈయన బెట్టింగ్‌లు, ఇతర అలవాట్లకు బానిసై రూ.లక్షలు అప్పులు చేసినట్లు తెలిసింది. అప్పులు చేసిన విషయం తల్లిదండ్రులకు చెప్పక పోవడం, అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. ఆదివారం హైదరాబాద్ నుంచి రాత్రి వచ్చి లింగాలలోని ఇంటికి వెళ్లకుండా కొత్తకుంటపల్లి శివారులో ఉన్న మామిడి తోటకు చేరుకున్నాడు. ఎప్పటి మాదిరిగానే ఉదయం తోట వద్దకు వెళ్లిన తండ్రి విష్ణువర్ధన్‌రెడ్డికి స్కూటీ కనిపించింది. తోటలో ఓ చెట్టు వద్ద ఉరేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ జగన్మోహన్ పరిశీలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజాపూర్: కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం ఈద్గాన్‌పల్లికి చెందిన వీరస్వామి (32) జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. శనివారం సాయంత్రం వ్యవసాయ పొలంలో పురుగుల మందుతాగి పడిఉండగా కుటుంబ సభ్యులు గమనించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యరాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మక్తల్ మండలం పస్పులలో..

మక్తల్: పురుగుమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని పస్పులకు చెందిన రాజు (40) ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ లక్ష్మీరెడ్డి తెలిపారు. మద్యానికి బానిసైన రాజు ఆర్థిక ఇబ్బందులతో శనివారం పురుగు మందు తాగగా కుటుంబ సభ్యులు మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలించగా అక్కడ మృతిచెందాడన్నారు. సోదరుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

క్రీడాకారుల్లో జోష్

- హెచ్‌సీఏ ఆధ్వర్యంలో క్రికెట్ శిక్షణ శిబిరాలు ఏర్పాటు
- సమ్మర్ క్యాంప్ పేరిట నెల రోజులపాటు తర్ఫీదు
- ఉత్సాహంగా పాల్గొంటున్న 800 మందికి పైగా క్రీడాకారులు


ఎండీసీఏ మైదానంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమ్మర్ క్యాంప్‌లు క్రికెటర్లలో జోష్ నింపాయి. గ్రామీణ ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను ఉమ్మడి జిల్లాలో ఆరు చోట్ల వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలను ఏర్పాటుచేశారు. మహబూబ్‌నగర్‌లోని ఎండీసీఏ మైదానం, కోస్గి, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, గద్వాల, కల్వకుర్తి పట్టణాల్లో గత నెల 20 నుంచి ఈనెల 20వ తేదీ వరకు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఆయా శిబిరాల్లో ఉదయం 5:30 నుంచి 8:30 గంటల వరకు శిక్షణ అందించగా.. 800 మందికి పైగా విద్యార్థులు, యువత ఉత్సాహంగా హాజరయ్యారు. శిబిరాల్లో క్రీడాకారులకు నెట్‌లతో పాటు జంబో కిట్‌లను అందుబాటులో ఉంచారు. రోజు అల్పాహారం, తాగునీటి సౌకర్యం కల్పించి, నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇచ్చారు.

ఎండీసీఏ మైదానంలో 300 మందికి పైగా శిక్షణ..

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో నిర్వహించిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 314 మంది విద్యార్థులు, యువత ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు. వీరిలో ముగ్గురు బాలికలు శిక్షణ తీసుకోవడం విశేషం. 8 మంది కోచ్‌లు విద్యార్థులకు శిక్షణ అందజేశారు. శిబిరంలో మొదటిసారి పాల్గొంటున్న చిన్నారులకు బ్యాట్ పట్టడం, బౌలింగ్ విధానం, ఫీల్డింగ్‌లపై శిక్షణ ఇచ్చారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల జట్లతో ఎండీసీఏ మైదానంలో 20 ఓవర్ల మ్యాచ్‌లు నిర్వహించారు.

విరాట్‌కోహ్లీ అంటే ఇష్టం..



విరాట్ కోహ్లి అంటే చాలా ఇష్టం. వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉంది. తల్లిదండ్రులు కూడా ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. ఇండియా జట్టుకు ఆడుతా.
– అశ్విత్‌సింగ్, మహబూబ్‌నగర్

నిరంతర సాధనతోనే సత్ఫలితాలు..



క్రికెట్ క్రీడలో ఎంతో పోటీ ఉంటుంది. క్రికెట్‌లో నిరంతరం ప్రాక్టిస్ చేస్తేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. ఆడాలనే కసి, పట్టుదల ఉంటే క్రికెట్‌లో రాణించవచ్చు. కేవలం వేసవి శిక్షణ శిబిరం వరకు పరిమితం కాకుండా రోజు ప్రాక్టిస్ చేస్తే మేటి క్రీడాకారుడిగా ఎదగవచ్చు.
– అబ్దుల్లా బిన్ అహ్మద్, క్రికెట్ కోచ్, ఎండీసీఏ

ఇండియా జట్టుకు ఆడటమే టార్గెట్..



ఇండియా జట్టుకు ఆడటమే నా టార్గెట్. ఐదేళ్ల నుంచి క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటున్న. ఇటీవల వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా జరిగిన లీగ్ మ్యాచ్‌ల్లో మంచి పరుగులు సాధించా. ఒక మ్యాచ్‌లో 72, మరో మ్యాచ్‌లో 42 పరుగులు చేశా.
– కనిష్క, ఏనుగొండ (మహబూబ్‌నగర్)

క్రికెట్ అంటే ఇష్టం..



టీవీల్లో మహిళలు ఆడే క్రికెట్‌ను చూసి, నేను కూడా క్రికెటర్ కావాలనే ఇష్టంతో శిక్షణ తీసుకుంటున్న. ఈనెల రోజుల వేసవి శిబిరంలో మెరుగైన శిక్షణ తీసుకున్న. ఇక నుంచి రెగ్యులర్‌గా క్రికెట్‌ను ప్రాక్టిస్ చేస్తా. క్రికెట్‌లో రాణించి ఇండియా జట్టుకు ఎంపికవుతా.
– సి.మణిదీపిక, మర్లు (మహబూబ్‌నగర్)

పెద్దయ్యాక ఎంఎస్ ధోనిలా ఆడతా..



18 నెలల నుంచి క్రికెట్ శిక్షణ తీసుకుంటున్న. ఎంఎస్ ధోనీ అంటే చాలా ఇష్టం. నేను కూడా బ్యాటింగ్, వికెట్ కీపింగ్ చేస్తా. ఇంకా క్రికెట్‌లో శిక్షణ తీసుకొని పెద్దయ్యాకా ధోనీలా ఆడుతా.
– షేక్ ఫర్హాన్, హబీబ్‌నగర్ (మహబూబ్‌నగర్)

క్రీడాకారులకు ప్రోత్సాహం..



ప్రతిభగల క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నాం. వేసవిలో ఏర్పాటుచేసిన క్రికెట్ శిక్షణా శిబిరాల్లో వందలాది విద్యార్థులు, యువత పాల్గొనడం సంతోషంగా ఉంది. శిబిరాల్లో 80 నుంచి 100 మంది ప్రతిభగల క్రీడాకారులను గుర్తించాం. రాబోయే రోజుల్లో గ్రామీణ క్రీడాకారులకు అండర్-14, 16, 20, 23 విభాగాల్లో ఆడేలా అవకాశం కల్పిస్తాం. క్రీడాకారులకు వసతి సౌకర్యం కల్పించి మెరుగైన శిక్షణ అందజేస్తాం. ఉమ్మడి జిల్లాలో ఆరు చోట్ల శిక్షణ శిబిరాలు ఏర్పాటుచేసిన హెచ్‌సీఏకు కృతజ్ఞతలు.
– ఎం.రాజశేఖర్, ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి

రెండు మద్యం దుకాణాల్లో చోరీ


మన్ననూర్‌లోని అరణ్య వైన్స్

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లోని అరణ్య, మాచారం వద్ద ఉన్న సమిష్టి మద్యం దుకాణాల్లో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. ఆయా షాపుల్లో జరిగిన దోపిడి తీరును అమ్రాబాద్ పోలీసులు పరిశీలించారు. దొంగలు సీసీ కెమెరాలలో గుర్తించకుండా ఉండేందుకు దుస్తులు లేకుండా ముఖాలకు ముసుగులు ధరించి పై కప్పు(రేకులు) తొలగించుకుని లోపలికి దిగినట్లు అక్కడి ఆధారాలను బట్టి తెలిసింది. ఈ క్రమంలో మాచారంలో రెండు బీర్లు దొంగలు తాగినట్లు తెలిసింది. మన్ననూర్‌లో మద్యంకు సంబంధించి ఎలాంటి దోపిడి కాలేదన్నారు. శనివారం బ్యాంకు సెలవు ఉండటంతో రెండు రోజులుగా ఆయా వైన్స్ షాపుల్లో కొన్ని డబ్బులు వెంట తీసుకుపోగా మన్ననూర్‌లోని రూ.90వేలు, మాచారంలో రూ: 60వేలు కౌంటర్‌లో ఉంచిన దొంగలు ఎత్తుకెళ్లారని యజమానులు శ్రీరాం, వీరార్జున్ తెలిపారు. పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుపై వెళ్తున్న కారులో అకస్మికంగా మంటలు చెలరేగడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. మంగనూర్ చెందిన మోహన్‌గౌడ్ ఆదివారం రాత్రి మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్ల వైపు కారులో వెళ్తుంటే మార్గమధ్యలోని ఎస్‌వీఎస్ సమీపంలో కారులో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించాయి. కారులో ఉన్న మోహన్‌గౌడ్ బయటకు దిగారు. మంటలు వ్యాప్తి చెంది కారు పూర్తిగా దగ్ధం అయ్యింది.

జనరల్ ఆస్పత్రిలో సిబ్బందిపై దాడి

- అద్దాలు ధ్వంసం.. కేసు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా జనరల్ ఆస్పత్రిలోని ఎంసీహెచ్ భవన్‌లో ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసునమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఆస్పత్రిలోని లేబర్ రూంలో ఆదివారం సాయంత్రం సిరిగిరి ప్రకాష్, అతడి భార్య గొడవ పడుతుండగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడానికి వెళ్లారు. వారిపై దాడిచేసి కొట్టడంతో పాటు ఆస్పత్రిలోని అద్దాలు ధ్వంసం చేశారు. గొడవ పెరగడంతో నివారించడానికి వెళ్లిన ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ మహేష్‌తో పాటు ఇతర సిబ్బందిపై అదే సమయంలో అక్కడికి వచ్చిన సిరిగిరి శ్రీను, సిరిగిరి ప్రభాస్, సిరిగిరి ప్రకాష్ దాడిచేసి యూనిఫాం చించివేశారు. ఈ ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: కొల్లాపూర్ నియోజకవర్గంలోని చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామంలో శ్రీధర్‌రెడ్డిని చంపిన హంతకులను కఠినంగా శిక్షించాలని పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాకేంద్రంలోని రెడ్డిసేవా సమితి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీధర్‌రెడ్డి హత్యకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్‌రెడ్డి, కోశాధికారి మల్లు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్రాంరెడ్డి, ప్రచార కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్‌రెడ్డి, సభ్యులు పరమేశ్వర్‌రెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనుకు చేవ.. చెరువు మట్టి


చెరువులోని ఒండ్రు మట్టి

పాడి-పంట
అధికారి సలహా: ఏడీఏ సక్రియ నాయక్

అలంపూర్: పంటల సాగులో ప్రధాన భూమిక భూసారానిదే. భూమిలో శక్తి ఉంటేనే దిగుబడి ఆశించిన మేరకు వస్తాయి. భూసారం తగ్గితే తెగుళ్లు, పురుగు బెడద ఎక్కువగా ఉంటుందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. పెట్టుబడులు పెరగడంతో పాటు పంట నాణ్యత తగ్గుతుందని పేర్కొన్నారు. వీటిని తట్టుకోవడానికి భూసారం అవసరమని వివరించారు.

భూసారం పెంపు ఇలా...

చెరువు పూడిక మట్టితో భూమి నాణ్యత పెరుగుతుంది. తేమను నింపుకొనే శక్తిని పెరుగుతుంది. నీటి వినియోగ సామర్థ్యంతో పాటు భూమిలోని సారం పెరగడానికి దోహదపడుతుంది. మట్టిలో సేంద్రియ కర్బనం, నత్రజని, భూసారం, పొటాష్, సూక్ష్మ పోషకాలు పెరిగి అధిక దిగుబడి వస్తోంది. సేంద్రియ కర్బనం ఎక్కువగా ఉంటే మినరలైజేషన్ ఎక్కువగా జరిగి మొక్కల పెరుగుదల ఉంటుంది. రైతులు చెరువుల్లోని మట్టిని పొలాల్లో వేసుకొని కలియ దున్నుతే అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది.

పండ్ల తోటల్లో..

మామిడి, జామ, దానిమ్మ, బత్తాయి తదితర పంటలకు చెరువు మట్టి వాడకంతో వేరు వ్యవస్థ బలంగా విస్తరించి ఏపుగా పెరుగుతుంది. దీంతో భూమిలో తేమ నిలుపుకొనే శక్తి పెరుగుతుంది. పాదులో మల్చింగ్ మాదిరిగా ఉపయోగపడుతుంది. ఎకరానికి 10 కిలోల చెరువు మట్టిని వేసుకోవచ్చు.

కూరగాయల సాగులో..

టమాట, బెండ, వంకాయ తదితర పంటల సాగులో అధిక దిగుబడి కోసం ఎరువులు ఎక్కువగా వాడుతున్నారు. దీంతో పెట్టుబడి విపరితంగా పెరుగుతుంది. కూరగాయలు సాగు చేసే


పొలాల్లో వేసిన ఒండ్రు మట్టి

పొలాల్లో ఎకరానికి 8 నుంచి 10 ట్రాక్టర్ల చెరువు మట్టి ఆఖరి దుక్కిలో వేసి కలియ దున్నితే మంచి నాణ్యత ఉన్న పంటలు వస్తాయి. పెట్టుబడి తగ్గుతుంది. అంతేకాక తేమ శాతం కూడా తగ్గకుండా ఉంటుంది.

కిలో ఒండ్రు మట్టిలో ఉండే పోషకాలు..

నత్రజని	720 మిల్లీ గ్రాములు
బాస్వరం	35 మిల్లీ గ్రాములు
పొటాష్	310 మిల్లీ గ్రాములు
కర్బనం	0.5 మిల్లీ గ్రాములు
జింకు	2.8 మిల్లీ గ్రాములు
బోరాన్	0.8 మిల్లీ గ్రాములు
గంధకం	18 మిల్లీ గ్రాములు

మేలు చేసే సూక్ష్మ జీవుల సాంద్రత 308 మిల్లీ గ్రాములు

అజ్ఞాతంలోకి..

నలుగురి పట్టివేతతో బెట్టింగ్ నిర్వాహకుల్లో ఆందోళన


క్రికెట్ బెట్టింగ్ కీలక ముఠా సభ్యుడు వడ్ల రాఘవాచారిని అరెస్టు చేసిన ఆదోని పోలీసులు(ఫైల్)

- ఓ ఎస్ఐ కుమారుడి అరెస్టుతో ఖంగుతున్న వైనం
- విచారణ వేగవంతం చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- బ్యాంకు ఖాతాలే లక్ష్యంగా దర్యాప్తు
- తమ వారిని రక్షించుకునేందుకు నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

ఎవరైనా చర్యలు తప్పవు



ప్రస్తుతం బెట్టింగ్ కేసులో పట్టుబడిన వ్యక్తుల నుంచి వివరాలు, బ్యాంకు ఖాతాలపై ఆరా తీస్తున్నాం. బెట్టింగ్ వ్యవహారంలో ఎవరు ఉన్నా చర్యలు తప్పవు. సిఫార్సులు ఎంత మాత్రం సహించేది లేదు. కీలక ముఠా సభ్యులు ఎవరనే విషయంపై ఆరా తీస్తున్నాం. పాత కేసుల ఆధారంగా కేసును చేధించి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
– భీమకుమార్, సీఐ, గద్వాల

గద్వాల క్రైం: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తూ.. అమాయక యువకులను అప్పుల ఊబిలోకి నెడుతున్న బెట్టింగ్ నిర్వాహకులను పట్టుకొనేందుకు పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ఇటీవల నలుగురు బెట్టింగ్ ముఠా సభ్యులను అదుపులోకి తీసుకొని కేసు సైతం నమోదు చేయగా.. అందులో జిల్లాకు చెందిన ఓ ఎస్ఐ కుమారుడు కూడా ఉండడంతో అసలు సూత్రధారులు ఖంగుతిన్నారు. ఇన్నాళ్లు తమను ఎవరూ పట్టుకోరు.. బెట్టింగ్‌లు ఆన్‌లైన్‌లో వేస్తుండడంతో గుర్తించలేరు అన్న ఆలోచనలో ఉన్న వారు ఈ విషయం తెలియడంతో అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. ఇన్నాళ్లు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తూ యువకుల నుంచి విలువైన వస్తువులు, ఆస్తులను కుదవపెట్టుకొని బెట్టింగ్ ఆడేలా సదరు ముఠా సభ్యులు, నిర్వాహకులు ఉసిగొల్పారు. ఈ విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. అసలు సూత్రధారులను పట్టుకునే పనిలో పడ్డారు.

వెలుగులోకి వచ్చింది ఇలా..

ఈ నెల 20వ తేదీన గద్వాల, వడ్డేపల్లి, మానవపాడుకి చెందిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. అయితే, పోలీసుశాఖలోని ఓ ఎస్ఐ కుమారుడు బెట్టింగ్ ఆడుతూ తెలిసిన వ్యక్తులకు ఈ బెట్టింగ్ విషయంలో వారి వస్తువులు, విలువైన ఆభరణాలు, వాహనాలను తాకట్టు పెట్టుకొని నగదు అప్పుగా ఇవ్వడం గమనార్హం. ఈక్రమంలోనే ఓ యువకుడు వాహనాలు, ఇతరాత్ర వాటిని కుదువ పెట్టుకుని రూ.లక్షల్లో అప్పు తీసుకొని బెట్టింగ్ ఆడి సర్వం కోల్పోయాడు. తీసుకున్న అప్పులు కట్టే పరిస్థితి లేక తాకట్టు పెట్టిన విషయాన్ని తల్లిదండ్రులతో చెప్పాడు. వెంటనే వారు పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో బెట్టింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో టాస్క్‌ఫోర్స్ బృందాలు గద్వాల, వడ్డేపల్లి, మానవపాడులలో ఉంటున్న కీలక ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు.

అయిజ వాసి చుట్టూ కేసు..

ఈ ఐపీఎల్ బెట్టింగ్ వ్యవహారంలో అయిజకు చెందిన పాత నేరస్తుడే ప్రధాన సూత్రధారిగా పోలీసుల విచారణలో బహిర్గతం అయ్యింది. ఇతన్ని పట్టుకుంటే జిల్లాలోని మిగతా సభ్యుల వివరాలు వెలుగులోకి వస్తాయి. అయితే, అయిజకు చెందిన వ్యక్తిపై 2017, 2018, 2019, 2023 సంవత్సరంలో గద్వాల, హైదరాబాద్, ఎమ్మిగనూర్, ఆదోని, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. 2023 మే 10న ఆదోని సీఐ శ్రీరాం కీలక ముఠా సభ్యుడైన వడ్ల రాఘవచారిని వడ్డేపల్లి మండలం తనగలలో అదుపులోకి తీసుకోవడం అప్పట్లో చర్చనీయాంశమైంది. తాజా బెట్టింగ్ వ్యవహారంలో ఎస్ఐ కుమారుడి అరెస్టుతో పోలీసుశాఖ సైతం ఖంగుతింది. ఇదిలాఉండగా, అదుపులోకి తీసుకున్న వారిని ఎలాగైన కేసు నుంచి బయట పడేలా చూడాలని జిల్లా నాయకులకు కొందరు సిఫారస్ చేస్తున్నారని, వారి నుంచి పోలీసు ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నారని సమాచారం. ఎమ్మెల్యే మొదలుకొని మంత్రులు, ఎమ్మెల్సీలు, కుల సంఘాల నాయకులు సైతం సిఫార్సులు చేస్తున్నారని తెలుస్తోంది.

ఖాతాలే లక్ష్యంగా విచారణ

బెట్టింగ్ రాయుళ్ల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల ఆర్థిక లావాదేవీలే కీలక ఆయుధంగా మారింది. ఆన్‌లైన్ చెల్లింపులు, గూగుల్ పే, ఫోన్ పే, పేటీయం ఇతరరాత్ర యాప్‌ల నుంచి నగదు చెల్లింపులపై అధికారులు ఆరా తీస్తున్నారు. బెట్టింగ్ ముఠా సభ్యుల ఖాతాల నుంచి భారీ మొత్తంలో నగదు లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల పట్టుబడిన వారి నుంచి సైతం రూ. 6లక్షల నగదు, విలువైన డాక్యుమెంట్లు, ఆభరణాలను టాస్క్‌ఫోర్స్ బృందాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. విచారణలో ఏ చిన్న అంశాలను సైతం నిర్లక్ష్యం చేయకూడదనే ఆదేశాలు ఉండడంతో ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గట్టు: రేషన్ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకలోని రాయచూర్‌కు తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. విధుల్లో ఉన్న బ్లూకోర్టు సిబ్బంది ఆదివారం ఉదయం మాచర్ల సమీపంలో వాహన తనిఖీలు చేపడుతుండగా మినీ గూడ్స్ వాహనంలో 26 క్వింటాళ్ల (53 బస్తాలు) రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు వివరించారు. బియ్యం తరలిస్తున్న బోయ మల్లికార్జున్, ఎరుకలి రమేష్, ఎరుకలి నర్సింహులుపై కేసు నమోదు చేసి వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్ హఠాన్మరణం

- వ్యవసాయ పనులు చేస్తూ గుండెపోటుతో కుప్పకూలిన వైనం


ఆనంద్ (ఫైల్)

వనపర్తి: డీసీఆర్‌బీలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఆనంద్(54) ఆదివారం తన వ్యవసాయ పొలంలో పని చేస్తూ ఒక్కసారిగా గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలం అన్నారంలో తన వ్యవసాయ పొలంలో ఆదివారం విద్యుత్ స్థంభాలు పాతిస్తూ.. పొలం పనులు చేసుకుంటున్న ఒక్కసారిగా ఛాతిలో నొప్పితో కుప్పకూలిపోయారు. పనిచేసేందుకు వచ్చిన కూలీలు ఆయన్ను వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. ఆస్పత్రికి తరలిస్తున్న యువకులు సీపీఆర్ చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఆయన భార్య కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకునేందుకు వెళ్లగా, ఇద్దరు కుమారులు ఉద్యోగ రీత్యా ఒకరు హైదరాబాద్‌లో, మరొకరు అమెరికాలో ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

I, C. RAVI KUMAR S/o C SHANKARAIAH, Qualification: M.A. in English, Designation: School Asst., Emp ID: 1721701, Shall hence forth be Known as CH. RAVICHANDRAN MAHARAJ S/o C. SHANKARAIAH, For the purpose of correction of wrong entries occurred in school records, Due to parental mistakes.

WANTED

We Required Qualified and Experienced Teachers in our school at venkateshwara colony MBNR to teach UKG to III E/M Interested candidates attend the Interview on 27th May 2024 (Monday) between 11 AM to 2 PM with Resume Original at school premises Contact Cell:8686838528

స్టార్ ఇండియా ఫైనాన్స్‌లో హోమ్‌లోన్స్‌లో పనిచేయడానికి మార్కెటింగ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ స్త్రీ /పురుషులు కావలెను. జీతం 10,000 వేల నుండి 20,000. సెల్: 9642725208

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K Ph: 9640258899/ 9640468899

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు [illegible] గమనించగలరు - సాక్షి మేనేజర్